క్లుప్తంగా

శివకామేశ్వరి అమ్మవారికి పుష్పార్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన పుష్పాలతో అర్చన నిర్వహించారు. లోక కళ్యాణార్థం వేదపండితులు శ్రీచక్రార్చన, కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

పేదలకు అన్నదానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కళ్ళే లలిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్ నగర్ రైతుబజార్ వద్ద శుక్రవారం అన్నదానం చేశారు. ఆ ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మి, జయదుర్గలు, మేఘవాణి పాల్గొని ముందుగా లలిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ నిరుపేద ప్రజలను ఆదుకోవడంలోనే అసలైన సంతృప్తి ఉంటుందని తెలిపారు. ఆకలితో, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 29 నెలల నుంచి ప్రతి నెలా నిరుపేదలకు ఉపయోగపడేలా కూలింగ్ వాటర్ మిషన్ల పంపిణీ, ఏసీ బాక్సులు, పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, నెలవారీ సరుకులు పంపిణీ, అన్నదానం వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ చందన సురేష్, ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్, జి. ధ్రువన్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి స్వరూపం సీతాదేవి



విజయవాడ కల్చరల్: మహాలక్ష్మి స్వరూపం సీతాదేవి అని ఆధ్యాత్మికవేత్త మండలీక కృష్ణ కుమార్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నూతన తెలుగు సంవత్సరం, శ్రీరామ నవమి సందర్భంగా టీటీడీ కల్యాణ మండపంలో శ్రీమద్రామాయణం సప్తాహం శుక్రవారం నిర్వహించారు. సీతా చరితం అంశంగా శుక్రవారం కృష్ణకుమార్ ప్రసంగించారు. హిందూ సమాజంలో స్త్రీ ప్రవర్తనకు, ఆలోచనకు సీతా చరిత్ర మార్గదర్శకంగా నిలిచిందని చెప్పారు. మాతృత్వానికి ప్రతి రూపంగా సీతను సీతమ్మ తల్లి అని పిలుస్తారని పేర్కొన్నారు. సీతా జననం, శ్రీ రామునితో వివాహం, అరణ్యవాసం, సీతాపహరణ, లంకా దహనం, సీత అగ్ని ప్రవేశం అంశాలను ఆయన శ్రావ్యంగా వినిపించారు. శనివారం సాయంత్రం 6 గంటలకు మరుధూరి నరసింహాచార్యులు సేవా ధర్మం అంశంగా ప్రసంగిస్తారని ధర్మ ప్రచార పరిషత్ ప్రోగామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ తెలిపారు.

అమ్మవారికి గాజులతో అర్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముత్యాలంపాడు పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి గాజులతో అర్చన నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు పర్యవేక్షించారు.

దుర్గమ్మ సన్నిధిలో యువ శతావధానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం యువ శతావధానం జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శుక్రవారం ఉప్పలదడియం భరత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అవధానంలో తొలి అచ్చ తెలుగు అవధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్, డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, మెట్ట వెంకటేశ్వరరావు, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ, పింగళి వెంకటకృష్ణారావు, కేఎస్ రామారావు, పీ భానుమతి, డాక్టర్ దండిభోట్ల దత్తాత్రేయ శర్మ పాల్గొన్నారు. శతావధానంలో పాల్గొన్న ప్రముఖులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ఈఓ రామారావు వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

సెంట్రల్‌లో ప్రగతి పరుగులు

- డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం
- ఆహ్లాదాన్ని అందించేలా పార్కుల అభివృద్ధి
- పేదల కాలనీల్లో మౌలిక సదుపాయాలు



దుర్గాపురంలో ఓపెన్ జిమ్



శ్రీనగర్ కాలనీలో నిర్మించిన ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్



అయోధ్యనగర్‌లో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

ఇది కదా.. అభివృద్ధి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఎన్నడూ జరగని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా 58 నెలల జగనన్న పాలన సాగింది. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు పరిష్కారం లభించింది. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే పార్కులు అభివృద్ధి చెందాయి. పేదలకు వైద్యం అందించేందుకు 4 పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మించారు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకు మూడు కొత్త సబ్‌స్టేషన్‌లు నిర్మించారు. ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందించేందుకు కొత్తగా మూడు రైతు బజార్లు నిర్మించారు. విజయవాడ –నూజివీడు ప్రధాన రహదారి మూడు కిలో మీటర్ల మేర అభివృద్ధి చేశారు. సెంట్రల్ డివైడర్, లైటింగ్ అందమైన పూల మొక్కలతో కొత్త రూపు దాల్చింది. 29 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు పట్టాలు పంపిణీ జరిగింది. పైపులు రోడ్డు– వైఎస్సార్ కాలనీ రోడ్లు అద్దంలా మెరిసిపోతుంది. సీసీ రోడ్లు , డ్రెయిన్లు, ఇతర మౌలిక సదుపాయాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. ఒక్క సెంట్రల్ నియోజకర్గంలోనే రూ. 800 కోట్ల నిధులతో అభివృద్ధి జరిగింది.

చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం...

డంపింగ్ యార్డు సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రధాన సమస్య. ఎన్ని ప్రభుత్వాలు మారిన సమస్యకు మాత్రం పరిష్కారం లభించలేదు. వైఎస్సార్ సీపీ ఎన్నికల సమయంలో సింగ్‌నగర్ వాసులకు హామీ ఇచ్చింది. ఈ మేరకు అధికారంలోకి రాగానే డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది. ఇపుడు డంపింగ్ యార్డును అందంగా , ఆహ్లాదంగా తీర్చిదిద్దింది. పాయకాపురం చెరువును రూ. 5 కోట్ల వ్యయంతో వైఎస్సార్ పార్క్‌గా అభివృద్ధి పరిచింది. వాంబే కాలనీ అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ చూపింది. ఐకానిక్ పార్క్ నిర్మాణం పూర్తి కావొస్తోంది.

మారిన రూపురేఖలు....

సెంట్రల్ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా అభివృద్ధి ఆనవాళ్లే కనిపిస్తున్నాయి. 58 నెలల వైఎస్సార్ సీపీ పాలనలో నియోజకవర్గ రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. ప్రజలకు మౌలిక సదుపాయాలు సమకూరాయి. నియోజకవర్గంలో 28 పాఠశాలలు నాడు - నేడు పథకంలో అభివృద్ధి చెందాయి. విజయవాడ నగరంపై ప్రత్యేకంగా సెంట్రల్ నియోజకవర్గంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపింది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి చేసి చూపింది. పేదలు నివసించే కాలనీల్లో మెరుగైన సదుపాయాలు కల్పించింది.

సత్తాచాటిన ఎస్‌ఆర్‌ఆర్ విద్యార్థులు



దాసరి అదస్నా, మాచవరం (959 మార్కులు)



జీవీఎస్ విశ్వతేజ, గుణదల (986 మార్కులు)

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియెట్ పరీక్షలలో సత్తాచాటారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థి దాసరి అదాస్నా 959 మార్కులు, హెచ్‌యూసీ విభాగంలో పటాన్ రజియా 939, ఎంపీసీ విద్యార్థి బేతాళ సంధ్య 944, ఎంఈసీ విద్యార్థి మునగా చంద్రశేఖర్ 904 మార్కులు సాధించారు. అలాగే ఒకేషనల్ విభాగంలో సీఎస్‌ఈ విద్యార్థి జి.వెంకట శేష సాయి విశ్వతేజ 986, ఎంఎల్‌టీ విద్యార్థి షేక్ సల్మా 973, ఎంపీహెచ్‌డబ్ల్యు విద్యార్థి సింధు 936 మార్కులతో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఫలితాలు సాధించారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ మాజేటి శ్రీరామమూర్తి కళాశాల సిబ్బంది అభినందించారు.

పరిశా వర్షిణికి అభినంధనలు

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 988 మార్కులు సాధించిన ఏలూరు రోడ్డు శ్రీచైతన్య విద్యార్థిని పరిశా వర్షిణిని కళాశాల డీన్ జి.హరిబాబు, ప్రిన్సిపాల్ ఎన్ గోకర్ణేశ్వర రావు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ప్రతిభ చూపించటం ఆనందంగా ఉందన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 463, 462, 461 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే బైపీసీ విభాగంలో 432, 430, 425 మార్కులు సాధించగా ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో 969 మార్కులు రావటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మీరావలి , కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ఎన్‌ఆర్‌ఐ విద్యార్థుల విజయభేరి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటర్మీడియెట్ ఫలితాల్లో విజయవాడ ఎన్‌ఆర్‌ఐ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం అన్ని విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించారని కళాశాలల సీఈఓ డి.చంద్రశేఖర్, డీన్ డి. సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా భవానిపురంలోని ఎన్‌ఆర్‌ఐ కళాశాలలో నిర్వహించిన విజయోత్సవ సభలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు , వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన ఒత్తిడి లేని వ్యక్తిగత శ్రద్ధతో ఉత్తమ శిక్షణ ద్వారా ఈ ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. జూనియర్ ఇంటర్ ఫలితాలలో 94.75 శాతం, సీనియర్ ఇంటర్ ఫలితాలలో 96.38 శాతం సాధించామని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కె నిఖిత(465), కె చంద్రశేఖరరెడ్డి(464), స్వాతి ఐశ్వర్యలక్ష్మి(463), నాగలక్ష్మీ(462), ఎస్ కె రెహమాన్(461), డి వినోద్(460) మార్కులు సాధించారన్నారు. అలాగే సీనియర్ విభాగంలో బి. సాయి శరత్ చంద్ర (989), సిహెచ్.ఎస్.వి.ఎస్.డి. నీలేష్ (981), యు. నమ్రత (983), డి. రేవంత్ సాయి (983), డి. సాయిశ్రీ (980), కె.ఎల్.వి. ప్రణవ్ (989) మార్కులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలల డీన్ డి. సూర్యనారాయణ, ప్రిన్సిపాల్స్ వి. శ్రీకాంత్, యస్. రాంబాబు, ఎస్. సతీష్, ఎ. అనిల్, ఎల్. మారుతీకృష్ణ, సిహెచ్. జయ చంద్ర నాయుడు పాల్గొన్నారు.

సీఎం జగన్ బస్సు యాత్ర విజయవంతం చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస్సు యాత్రకు క్రైస్తవులు తరలిరావాలని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం పిలుపునిచ్చారు. మధురానగర్‌లో శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో శనివారం బస్సు యాత్ర ప్రవేశించనున్న నేపథ్యంలో వేలాది మంది తరలి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీస్సులు అందజేయాలని కోరారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గం అభ్యర్థి దేవినేని అవినాష్, పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి ఆసిఫ్‌లకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రెవరెండ్ ఎం.ఐజాక్, రెవరెండ్ ఎస్. డానియేల్, రెవరెండ్ డాక్టర్ కనపర్తి ప్రభాకర్, రెవరెండ్ కిరణ్ తదితరులు మాట్లాడారు. తొలుత జగనన్న బస్సు యాత్ర విజయవంతం కావాలని ఏసుక్రీస్తు ఆశీస్సులు లభించాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మార్కెట్‌లోకి అధునాతన పల్సర్ బైక్



సరికొత్త పల్సర్ బైక్‌ను తొలి కస్టమర్‌కు అందజేస్తున్న సీఈవో పీవీ సత్యనారాయణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): బజాజ్ ఆటో వారి అధునాతన బైక్ పల్సర్ 150 సీసీని శుక్రవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా బెంజిసర్కిల్ వద్ద ఉన్న వరుణ్ బజాజ్ షోరూమ్‌లో ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీవీ సత్యనారాయణ సరికొత్త బైక్‌ను ఆవిష్కరించి తొలి కస్టమర్‌కు తాళాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పల్సర్ 4 స్ట్రోక్, ఎయిర్ కూల్డ్, క్లోజ్డ్ లూప్డ్ ఫ్యూయల్ ఇంజక్షన్ సిస్టమ్, 14 హార్స్ పవర్, 13.4 ఎన్ఎం టార్క్ అందించగల, 5 – స్పీడ్ గేర్ బాక్స్ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బజాజ్ ఆటో ఏరియా మేనేజర్ సదత్ బాషా ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహేష్ రాజీనామాతో నగరంలో జనసేన ఖాళీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పోతిన మహేష్ రాజీనామాతో జనసేన మొత్తం నగరంలో ఖాళీ అయిందని ఆ పార్టీకి రాజీనామా చేసిన పలువురు డివిజన్ అధ్యక్షులు పేర్కొన్నారు. పోతిన మహేష్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. విజయవాడ పశ్చిమ నుంచే కాకుండా సెంట్రల్, తూర్పు నియోజకవర్గాల నుంచి చాలామంది నాయకులు రాజీనామాలు చేశారన్నారు. పశ్చిమంలో ఇప్పటికే దాదాపు 12 డివిజన్ల అధ్యక్షులు, పలువురు డివిజన్ సమన్వయకర్తలు పలు అనుబంధ విభాగాల నాయకులు జనసేనకు రాజీనామాలు చేశారని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో ఇటీవల జనసేన పార్టీ మీటింగ్ జరిగిందని, అది ఆ పార్టీ మీటింగ్ కాదని, కూటమి సమావేశమని చెప్పారు. ఆ సమావేశానికి కూడా ఆపసోపాలు పడితే విజయవాడ నగరం మొత్తం మీద నుంచి 30 మంది నాయకులు కూడా హాజరు కాలేదన్నారు. మిగిలిన వారందరినీ డబ్బు, బిర్యానీలతో తరలించారని చెప్పారు. మహేష్ నిజాయితీకి మెచ్చి జనసేన నాయకులు పలువురు మాట తప్పని, మడమ తిప్పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరడం జరిగిందన్నారు. 11 సంవత్సరాల నుంచి రాజీ లేకుండా పోరాడిన పశ్చిమ నియోజకవర్గంలోని జనసేన నాయకుడికి సీటు లేకుండా అన్యాయం చేస్తే ఏమి చేయాలని ప్రశ్నించారు. పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో పోతిన మహేష్‌కు అన్యాయం జరిగిందని రాష్ట్రం మొత్తం ప్రజలందరూ ముక్తకంఠంతో చెబుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంతో పాటు తూర్పు, సెంట్రల్‌ల్లో సైతం వైఎస్సార్ సీపీ విజయం సాధించే విధంగా తామందరం పని చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు కొరగంజి వెంకటరమణ, శిగినంశెట్టి రాముగుప్తా, సామి గోవిందు, రమేష్, షేక్ అమీర్‌భాష, ఎం.హనుమాన్, షేక్ మోబినా, పొట్నూరు శ్రీనివాసరావు, తమ్మిన రఘు, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు చంద్రబాబుకు లేదు

సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడ రూరల్): విజయవాడ నగరాభివృద్ధిని నిర్లక్ష్యం చేసిన చంద్రబాబుకి ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు లేదని సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 63వ డివిజన్ సుందరయ్యనగర్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన గడప గడపకు వెళ్లి ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాల బ్రోచర్లను ప్రజలకు అందజేసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసి జగనన్న ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని చెప్పారు. పథకాలతో లబ్ధి పొంది అన్ని వర్గాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలో 25 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందుతానని దీమా వ్యక్తం చేశారు. దిక్కుమాలిన కూటమికి ఎన్నికల్లో ఓట్లు వేసే పరిస్థితి రాష్ట్రంలో లేదన్నారు. పిల్ల సినిమా యాక్టర్ల గురించి భయపడే వారు ఎవ్వరూ లేరన్నారు.

సీఎం బస్సుయాత్రను విజయవంతం చేయండి...

ఈ నెల 13వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే బస్సు యాత్రను విజయవంతం చేయాలని ప్రజలకు వెలంపల్లి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు బస్సు యాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గ ప్రజలు ముఖ్యమంత్రికి ఘనస్వాగతం పలకాలని కోరారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వాటర్ ట్యాంక్ దగ్గర నుంచి శిఖా మణి సెంటర్ చుట్టుగుంట, అల్లూరి సీతారామరాజు బ్రిడ్జి, ఘంటసాల సంగీత కళాశాల, ఫుడ్ జంక్షన్, బుడమేరు వంతెన, అజిత్ సింగ్ నగర్ ఫ్లైఓవర్, డాబా కోట్లు సెంటర్, కృష్ణ హోటల్ సెంటర్, పైపుల రోడ్, పాయకాపురం, ప్రకాష్ నగర్, కండ్రిక ప్రాంతాల మీదగా బస్సు యాత్ర సాగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మేడా రమేష్, డివిజన్ కో–ఆర్డినేటర్ పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సీహెచ్ రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



పెదపులిపాకలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న గుప్తా

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. లయన్స్‌క్లబ్ తాడిగడప సాయినగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని డిస్ట్రిక్టు గవర్నర్ లయన్ జేఎన్.గుప్తా ప్రారంభించారు. గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా గ్రామంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయటం వలన గ్రామంలో పేదలు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవటానికి అవకాశం ఏర్పడిందన్నారు. లయన్స్ క్లబ్ ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం వలన గ్రామీణా ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో, తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు కె.చక్రధరరావు, కార్యదర్శి యలమంచిలి సురేష్, సభ్యులు కేవీఎస్. చౌదరి, ఎం.సాంబశివరావు, ఆర్.సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

జాతి మనుగడలో భాష కీలకం



గ్రంథావిష్కరణ సభలో జంధ్యాల శంకర్, గోళ్ళ నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్: భాషా సంస్కృతి, సంప్రదాయాల కృషికి సాహిత్య సంస్థలు, ప్రభుత్వాలు కృషి చేయాలని మాజీ మేయర్ జంధ్యాల శంకర్ అన్నారు. రసభారతి సాహితీ సంస్థ, గోళ్ళ రాధాకృష్ణ మూర్తి, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం డాక్టర్ జంధ్యాల మహతీశంకర్ రచించిన పద్య మంజరి, డాక్టర్ పరదేశిబాబు రచించిన బుద్ధుని బోధనలు– జాతక కథలు, కవి సమ్మేళనం నిర్వహించారు. పద్య మంజరి గ్రంథాన్ని ఆవిష్కరించిన శంకర్ మాట్లాడుతూ జాతి మనుగడలో భాష కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. బహుముఖ ప్రతిభాశాలి సాహితీవేత్త జంధ్యాల మహతీ శంకర్‌గా అభివర్ణించారు. జాతక కథలు గ్రంథాన్ని గోళ్ళ నారాయణరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుడు గౌతమ బుద్ధుని బోధనలు సర్వదా ఆచరణీయమన్నారు. గ్రంథాలను కవి పండిత పోషకుడు చెట్లపల్లి మారుతీ ప్రసన్నకు అంకితమిచ్చారు. రసభారతి అధ్యక్షుడు పొన్నలూరి లక్షణరావు సభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ క్రోవి పార్థసారథి, డాక్టర్ జంధ్యాల జయకృష్ణ బాపూజీ మహతీ శంకర్ సాహిత్య సేవలను వివరించారు. నూతన సంవత్సర ఉగాది సందర్భంగా చలపాక ప్రకాష్, డాక్టర్ వెన్నావల్లభరావు, సర్వాశారద స్వీయ కవితా గానం చేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ పరదేశిబాబు పర్యవేక్షించారు.

చంద్రబాబు దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నేత కావూరి జయకుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీలను అడుగడుగునా అవహేళన చేస్తున్న ప్రతిపక్షనేత చంద్రబాబు దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నేత కావూరి జయకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి రోజున ఆయన చెంతకు వెళ్లి దళితులకు క్షమాపణ చెప్పాలన్నారు. లేని పక్షంలో పేదల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అంటూ అవమానించారని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నా ఆయన పెత్తందారీ మనస్తత్వంలో ఏ మాత్రం మార్పులేదన్నారు. శింగనమల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టిప్పర్ డ్రైవర్‌కు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారన్నారు. కానీ చంద్రబాబు వేలిముద్ర గాళ్లు అంటూ అవహేళన చేశారన్నారు. చంద్రబాబు, ఆయన పార్టీ నాయకులకు దళితులు, బహుజనులు, ఎస్సీ సామాజిక వర్గాలంటే చిన్నచూపు అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాజవరపు వెంకటేష్‌బాబు, లేళ్లపూడి లాజర్, గుంతక రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.29 కే కిలో బియ్యం పంపిణీ చేయాలి

కంకిపాడు: రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా, రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు షేక్ మాబిని డిమాండ్ చేశారు. ఈడుపుగల్లులోని సంఘం కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నాణ్యమైన సన్నబియ్యం రూ. 29 కే సరఫరా చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటన జారీచేసి మూడు నెలలు గడిచిందన్నారు. అయితే పంపిణీ ప్రక్రియ ప్రధాన ప్రాంతాలకే పరిమితం అయ్యిందన్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం చేరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

వృద్ధుడు అదృశ్యంపై కేసు

పెనమలూరు: పోరంకి గ్రామంలో వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం.. పోరంకి సత్యప్రైడ్ అపార్టుమెంట్‌లో బొమ్మారెడ్డి కార్తీక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతని తండ్రి బాలకృష్ణారెడ్డి (63) కుమారుడితోనే ఉంటాడు. అతను ఏపీ ఆయిల్ సీడ్స్‌లో మేనేజర్‌గా పని చేసి పదవీ విరమణ చేసిన తరువాత గత 3 సంవత్సరాలుగా కుమారుడి వద్దే ఉంటున్నాడు. కార్తీక్‌రెడ్డి వసంతనగర్‌లో కొత్తగా ఇల్లు నిర్మాణం చేస్తున్నాడు. కొత్త ఇంటికి సొమ్ము ఎక్కువగా ఖర్చు చేస్తున్నామని బాలకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో తగాదాపడి 11వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి పోయాడు. అతని కోపం వెతికినా తని ఆచూకీ తెలియక పోవటంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పెనమలూరు: అపార్టుమెంట్‌లో పిల్లల వద్ద తలెత్తిన తగాదా కారణంగా వ్యక్తి పై పలువురు దాడి చేయటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం .. యనమలకుదురు పెట్రోల్ బంక్ వద్ద అమీర్‌టవర్స్‌లో వేముల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతను ఏపీ సెక్రటేరియేట్‌లో ఐటీ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కాగా గురువారం అతను ఉంటున్న అపార్టుమెంట్ ఆవరణలో పిల్లలు ఆడుకుంటూ గొడవ పడ్డారు. అదే అపార్టుమెంట్‌లో ఉంటున్న జ్యోతి కోపంతో నాగేశ్వరరావు పిల్లలను కొట్టింది. దీంతో నాగేశ్వరరావు, అతని కటుంబ సభ్యులకు.. జ్యోతికి వాగ్వాదం జరుతున్న సమయంలో జ్యోతికి మద్దతుగా ముగ్గురు వ్యక్తులు వచ్చి నాగేశ్వరరావుపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన నాగేశ్వరరావు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేరాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అందరూ సోదరభావంతో మెలగాలి

ఆటోనగర్(విజయవాడతూర్పు): అందరూ సోదర భావంతో మెలగాలని పలువురు ముస్లింలు తెలిపారు. ఆటోనగర్ 4వ రోడ్డులో పాత టైర్ల యజమానులు ఈద్ మిలాప్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలతో పాటు హిందువులు, క్రైస్తవులు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. రంజాన్ పర్వదినం మరుసటి రోజున ఈద్ మిలాప్ చేయడం ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో కలాం బ్యాటరీ వర్క్స్ అధినేత అబ్దుల్ కలాం , ఏటీఏ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు, మాజీ ఐలా చైర్మన్ ఎస్.దుర్గాప్రసాద్, బాజీషరీఫ్, ఎండీ నూర్, డిస్పోజబుల్ అధ్యక్షుడు గౌస్‌ఖాన్, ఆర్గనైజర్స్ ఎండీ హరీఫ్, రంహతుల్లా, షరీఫ్, ఎండీ రిజ్వాన్, ఎస్‌కె బాబు, ఖాదిర్ తదితరులు పాల్గొన్నారు.